**'సుమతి లేచిపోయింది' అనే వార్త కంటే 'శర్మగారి పెద్దకూతురు లేచిపోయింది' అనే వార్తే ఆ వూరు వూరంతా ఫోల్లుమంది.**

**మరి నిప్పులాంటి శర్మగారి కుటుంబంలోనుంచి ఓ ఆడది పరాయి మగాడితో లేచిపోవటం అంటే మాటలా? ఎక్కడ నాలుగు నోళ్లు చేరితే అక్కడ ఆ కుటుంబం గురించే చర్చ.**

# దిల్ వాలే

—మహర్షి

ఇంత అవమానాన్ని భరిస్తూ పాపం శర్మగారు బ్రతుకుతారంటావా... అనే వాళ్లు కొందరైతే... ఆ సుమతికిదేం పోయేకాలం? బంగారంలాంటి మొగుడ్ని వదిలేసి ఎవరో ముక్కూమొహం తెలియని అనామకుడితో లేచిపోతుందా... కలికాలం అంటూ సుమతికి శాపనార్థాలు పెట్టేవాళ్లు మరికొందరు.

ఏదైతేనేమి? నిప్పులాంటి శర్మగారి కుటుంబం గురించి తరతరాలు చెప్పుకునే దారుణం ఒకటి ఆ కుటుంబంలో జరిగిపోయింది.

* * *

"ప్రియమైన స్నేహితురాలు గారికి

నీ ప్రాణ స్నేహితురాలు సుమతి కన్నీళ్లతో వ్రాయునది.

నేను చేసిన పని గురించి నువ్వీపాటికి తెలుసుకునే ఉంటావు. ముందు ముందు నమ్మి ఉండవు. ఆ తర్వాత నిజం తెలిసి 'నా ప్రాణస్నేహితురాలేనా ఇలా చేసింది' అని ఆశ్చర్యపోయి ఉంటావు. నీకేమిటి... నేను చేసిన పని గురించి నాకే ఆశ్చర్యంగా ఉంది. పరిస్థితులు నన్నిలా దిగజార్చాయి గౌరీ! నేనిలా దిగజారిపోవటం వెనక ఉన్న కథ గురించి నువ్వు తెలుసుకోవటం కోసమే ఈ ఉత్తరం... కనీసం నువ్వైనా నన్నర్థం చేసుకుంటావన్న ఆశతో. ఈ లోకంలో నన్ను నువ్వు తప్ప ఎవరర్థం చేసుకుంటారు గౌరి? ఆ మంచి మనసు నీకొక్కదానికే ఉంది.

నవ్వు అనేది ఇంత ఖరీదైనదని, అది ఏడుపులాగ మాటి మాటికొచ్చేది కాదని నాకు తెలియదు గౌరి! అయినా నా పదేళ్ల వైవాహిక జీవితములో నేనెప్పుడు నవ్వానని? అప్పుడెప్పుడో పెళ్లికాకముందు నవ్వేదాన్ని. ఆ తర్వాత నా మెళ్లో మూడుముళ్లు పడ్డప్పుడు తాళిబొట్టును చూసుకొని ఆనందంతో, గర్వంతో నవ్వాను. అంతే!

మొదటి రాత్రి నా భర్త ఇంతకుముందు నువ్వెవరినైనా ప్రేమించావా అని ప్రశ్నించినప్పుడు నవ్వలేక నవ్వాను. పశువులా మీదపడి తన కోరిక తీర్చుకొని 'నీకిదే మొదటి అనుభవమా? నాకెందుకో నిన్ను చూస్తుంటే ఒకసారి వాడిన పువ్వులా కనిపిస్తున్నావే, అన్నప్పుడు గుండెపగిలి ఏడ్చాను.

సాయంత్రం వేళ కాస్తంత సాహిత్యంమీద చర్చ — ఈ డ్రెస్ నీ వంటికి ఎంతో బాగుంది అన్న పొగడ్త! నేకోరుకున్న జీవితం అది గౌరి! వేకువజామునే నిద్రలేచి అలసి నిద్రిస్తున్న నా భర్త మొఖంలోకి ప్రేమగా చూస్తూ చెక్కిలిమీద ఆప్యాయంగా ముద్దుపెట్టుకోవాలనే కోరికతో ఉన్న నేను — ఉదయం నిద్ర లేవగానే వళ్ళంతా నొప్పులతో, రాత్రి తాలూకు రాక్షసత్వానికి ప్రతీకలా ఉన్న నా వంటిమీద గాయాల్ని చూస్తూ కూర్చోవటం ఎంత నరకమో ఒక్కసారి ఆలోచించు.

ఇంటిముందు ముగ్గేసి ఆ ముగ్గు మధ్యలో కూర్చొని కన్న కలలు — ఏటి ఒడ్డున కూర్చొని ఇసుకలో పిచ్చుక గూళ్లు కడుతూ వూహించిన వూహాలు — గులాబీపువ్వు మధ్యలో మల్లెపువ్వునుంచి తన్మయత్వం చెందిన రోజులు — నా వూహాలు — నా ఆశలు — నా ఆలోచనలు అన్నీ అన్నీ ఒక పెళ్లి అనే మూడుముళ్ల బంధంలోపడి సర్వనాశనమయ్యాయి... ఈ పెళ్లి అనే వ్యవస్థమీదే నాకసహ్యమేస్తుంది గౌరి!

నిజం. త్రాగి ఏ అర్ధరాత్రో ఇంటికొచ్చే భర్తకోసం ఎదురుచూడటం ఎంత నరకమో నీకు తెలియదు. ఆ భర్తే తన అలస్యానికి కారణం కూడా చెప్పకుండా తన పైశాచిక ఆనందంకోసం తన భార్యను బలిపెట్టటం ఎంత నరకమో నువ్వు వూహించలేవు.

ఇలా ఎందుకు జరుగుతుంది? ఇలా ఎందుకు జరుగుతుంది? అని ఎన్ని రాత్రిళ్లు నిద్రలేకుండా ఆలోచించానో తెలియదు గౌరి!!!

ఇదంతా కేవలం నేనాయన భార్యనేగా... ఆయనేం చేసినా, ఎలా ప్రవర్తించినా భరిస్తాననేగా.

క్రొత్తగా రెక్కలొచ్చిన పక్షి ఆనందంతో ఆకాశంకేసి ఎగురుతుంది. రెక్కలు తెగిన పక్షి — ఎగిరే పక్షికేసి నిస్సహాయముగా చూస్తుంది. తన స్థితిని తలచుకొని దుఃఖిస్తుంది. నా వైవాహిక జీవితం కూడా రెక్కలు తెగిన పక్షిలా అయిపోయింది.

ఆఫీస్‌నుంచి ఇంటికొచ్చే భర్తను వాకిట్లో నిలబడి చిరునవ్వుతో స్వాగతం పలికే భార్యను — ఆ భార్య నడుముచుట్టూ చేతిని చుట్టి ఆప్యాయంగా లోపలకి నడిపించుకెళ్లే భర్తను చూసి దిగులుపడేదాన్ని. నన్నొక భార్యగా గుర్తించకపోయినా పరవాలేదు గాని! కనీసం ఒక మనిషినని కూడా చూడకుండా, పశువులా భావించి, పశువులా ప్రవర్తించే నా భర్త దగ్గర నేనెందుకుండాలి? ఎవరికోసం ఉండమంటావ్

వు?! ఈ సమాజం కోసమా?

మరి నా భర్త ఏ అర్ధరాత్రో తాగొచ్చి బెల్టుతీసి వాతలుపడేటట్టు నన్ను కొట్టినప్పుడు ఈ సమాజం నన్ను ఓదార్చలేదే... తన పైశాచిక ఆనందంకోసం నా భర్త నన్ను నగ్నంగా నిలబెట్టి ఎర్రగా కాలిన సిగరెట్‌తో నా శరీరంమీద కాల్చినప్పుడు— ఆ దారుణకృత్యాన్ని ఈ సమాజం ఆపలేదే... మరి అలాంటి ఈ సమాజాన్నిచూసి నేనెందుకు భయపడాలి?

ఈ జీవితం ఆ దేవుడు నాకిచ్చిన వరం. అలాంటి వరప్రసాదమైన ఈ జీవితాన్ని కేవలం పెళ్లి అనే బంధానికి కట్టుబడి, ఈ సమాజాన్ని చూసి భయపడి దుఃఖమయం చేసుకోవలసిన అవసరం నాకు లేదు. ఈ జీవితం ఆ దేవుడిది. ఈ జీవితానికి సంబంధించి ఏదైనా ప్రశ్నించాల్సివస్తే... ఆ హక్కు ఆ దేవుడొక్కడికే ఉంది. అందుకే నన్నర్థం చేసుకున్న వ్యక్తితో లేచిపోయాను.

నువ్వు అడగవచ్చు. నీ భర్త దుర్మార్గుడైతే మరి నీ కన్నవాళ్ల దగ్గరకు రావచ్చు కదా— మరొక వ్యక్తితో లేచిపోవలసినంత అవసరమేమొచ్చింది అని.



పరువే ప్రాణంగా బతుకుతున్న నా కన్న తండ్రి — భర్త నొదిలేసి పుట్టింటికొచ్చిన తన కూతుర్ని చేరదీస్తాడా? ఒకవేళ కన్న మమకారాన్ని చంపుకోలేక చేరదీసినా, మళ్లీ నన్నా నరకకూపంలోకి నెట్టకుండా ఉండగలడా? ఒకవేళ ఆయనుండగలిగినా ఈ సమాజం ఆయనను మనశ్శాంతిగా ఉండనిస్తుందా?!! సిగ్గులేకుండా భర్తనొదిలేసి వచ్చిన కూతుర్ని ఇంటపెట్టుకొనిగానుగెద్దులా మేపుతున్నాడు అంటూ చీల్చిచెండాడదు. అందుకే ఎప్పటికీ నా మొఖం నాకన్నవాళ్లకు చూపించకూడదని మరొకరితో లేచిపోయాను.

మరి నువ్వు నమ్ముకున్న వ్యక్తి మాత్రం ముందు ముందు నిన్ను ప్రేమగా చూసుకుంటాడనే నమ్మకమేముంది? అనే అనుమానం కూడా రావచ్చు నీకు.

ముందు ముందు నా జీవితం ఎలా గడుస్తుందన్నది చివరికి ఎలా ముగుస్తుందన్నది నాకనవసరం. ప్రస్తుతం నా ప్రియుడు — నా భర్తకంటే ఎన్నోరెట్లు గొప్పవాడు. మంచివాడు.

ఇప్పుడు నా కానందంగా ఉంది గౌరి! భర్త పెట్టే చిత్రహింసలు ఏడుస్తూ మౌనంగా భరించే సగటు ఆడపిల్లల్లా కాకుండా ఈ వివాహ బంధాన్ని నేను తెంచుకోగలిగాను. నేను చేసిన ఈ పనికి నావైపునుంచి ఆలోచించి నన్నర్థం చేసుకుంటావన్న ఆశతో...

నీ,

—సుమతి!

ఉత్తరం పూర్తిగా చదివిన గౌరి కళ్ళు చెమ్మగిల్లాయి. అది ఆనందమో! దుఃఖమో తెలియటంలేదు. ఒకటిమాత్రం మనస్ఫూర్తిగా అనుకుంది — 'ఇకనుంచైనా నీ జీవితం సుఖమయమవుగాక!'